క్లుప్తంగా

కండలేరులో 48.794 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 48.794 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,750 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1100, పిన్నేరు కాలువకు 60, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూర్ఛవ్యాధిపై అవగాహన

కోట: స్థానిక జనతా క్లినిక్‌లో బుధవారం మూర్ఛవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ సంఘమిత్ర మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ప్రమాదకరం కాదన్నారు. అనంతరం వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



నియామక పత్రం అందుకుంటున్న రామకృష్ణ

సూళ్లూరుపేట: మాలమహానాడు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా తడ ప్రాంతానికి చెందిన కుదిరి రామకృష్ణను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షులు వదనాల వెంకటరమణ తెలిపారు. నెల్లూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ మాలలకు ఎలాంటి అన్యాయం జరిగినా ముందుండి పోరాటాలు చేస్తానని పేర్కొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు సరుకుల పంపిణీ



గూడూరు రూరల్: గూడూరు పట్టణం, ఇతర ప్రాంతాల్లోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు బుధవారం ఏరియా ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని ద్వారా ఫల సరుకులు పంపిణీ చేశారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కడివేడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య సంజీవని పథకం ద్వారా ప్రతి నెలా డాక్టర్ జనార్దన్‌రెడ్డి రోహినమ్మ దాతృత్వంతో సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు.

మైకా గని పరిశీలన

సైదాపురం: మండలంలోని ఓరుపల్లి గ్రామ సమీపంలో ఉన్న జయలక్ష్మి మైకా గనిని బుధవారం తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. ఈ గనికి సంబంధించిన లీజు గడువు ముగిసింది. ఈ క్రమంలో తనిఖీలు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కళ్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ యువనేత, కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేలూరు కళ్యాణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక యువత, కుటుంబ సభ్యుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు మురళీరెడ్డి, హరిరెడ్డి, పెంచలయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తరచూ విద్యుత్ కోతలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని పలుచోట్ల తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గరిడీ వీధి, అమరాగార్డెన్, రైస్ మిల్లు వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పలుమార్లు విద్యుత్ అంతరాయం కలుగుతోంది. దీంతో ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై కార్యాలయానికి ఫోన్ చేస్తే సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

దొరవారిసత్రం: మండల కేంద్రమైన దొరవారిసత్రంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రెండు ఆటోలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఆటో నాయుడుపేట నుంచి చెన్నైకి వెళుతోంది. దొరవారిసత్రం వద్ద వేగంగా వచ్చిన మరో ఆటో ఢీకొంది. ఆటో డ్రైవర్ మురళి, ప్రయాణికులు రాజా, శంకర్ గాయపడ్డారు. ప్రమాదంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీలో
ఆగిన ఇళ్ల నిర్మాణాలు



కోట: చిట్టేడులో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

'పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం.. అధికారంలోకి వచ్చి వంద రోజులకే అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి మాది మంచి ప్రభుత్వం అని నిరూపించుకున్నాం..' అని టీడీపీ కూటమి నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి మాది మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకున్నారు. పల్లె పండుగ పేరుతో సంబరాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం.. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఆక్రోశంతో జగనన్న కాలనీలు.. అక్కడున్న పేదల గురించి పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు కల్పించడం లేదు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో తమ సొంత ఇంటి కల నేరవేరేదెన్నడోనని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెంకటగిరి టౌన్: నిరుపయోగంగా ఉన్న విద్యుత్ మోటారు

- మౌలిక సదుపాయాల కొరతతో అవస్థలు పడుతున్న ప్రజలు
- బురదమయమైన రోడ్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వెంకటగిరి రూరల్/కోట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరుపతి జిల్లాలోని ఎక్కడా లేని విధంగా వెంకటగిరిలో 80 ఎకరాల్లో సుమారు 2500 ప్లాట్లతో లేఅవుట్ ఏర్పాటు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. అలాగే గూడూరు నియోజకవర్గం కోట మండలంలో 299 ఇళ్లు కేటాయించింది. ఇసుకతోపాటు ఇతర వస్తువులు అందుబాటులో ఉంచింది. వెంకటగిరి జగనన్న కాలనీలో సుమారు 10 బోర్లు వేసి మోటార్లు బిగించి నీటి సౌకర్యం కల్పించింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. కొంతమంది గృహ ప్రవేశం చేసి నివాసం ఉంటున్నారు. మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిపోయాయి. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేతలు జగనన్న కాలనీపై శీతకన్ను వేయడంతో నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. వసతుల గురించి పట్టించుకోకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు చేసే లబ్ధిదారులు, అక్కడ నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులకు గురైన మోటారు

గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కాలనీలో పలుచోట్ల సుమారు 10 విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 6 మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నీటి సౌకర్యం లేక ఇళ్ల నిర్మాణం కొనసాగించేందుకు వీలుకావడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. దీనికి తోడు రోడ్ల పొడవునా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు నిరుపయోగంగా మారాయి. పలు ట్యాంకులు చోరీకి గురయ్యాయి.

అధ్వానంగా రోడ్లు

గత ప్రభుత్వం కాలనీలో తాత్కాలికంగా మట్టి రోడ్లు ఏర్పాటుచేసింది. ప్రస్తుత ప్రభుత్వం రోడ్లపై దృష్టిసారించకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలమయంగా మారాయి. ఇళ్ల నిర్మాణ వస్తువులను తరలించే వాహనాలు తిరుగుతుండడంతో పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారాయి. కనీసం నడిచేందుకు కూడా వీలుకావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణం

కాలనీలో మౌళిక సదుపాయులు కల్పన కల్పించకపోవడం, నీరు, సకాలంలో ఇసుక అందుబాటులోలేకపోవడంతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు ఆగిపోయి. కాలనీలో మొత్తం 20124 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. వాటిలో 475 ఇళ్లు పునాది దశలో ఉన్నాయి. వాటికి బిల్లులు ఇస్తే పనులు మొదలు పెడతామని లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే 90 ఇళ్లు అటక లెవల్‌లో ఆగిపోయాయి. 270 ఇళ్లు గోడలు పూర్తయ్యాయి. 189 ఇళ్లు పైకప్పు వేయాల్సి ఉంది. 540 ఇళ్లు పూర్తయ్యాయి. మౌలిక వసతులు లేకపోవడంతో గృహ ప్రవేశాలు చేయడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రస్తుతం సుమారు 350 కుటుంబాలు కాపురం ఉంటున్నాయి. ఇక్కడి వారికి వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం అర్బన్ పీహెచ్‌సీ-2 మంజూరు చేసింది. అధికారులు స్థలాన్ని కూడా కేటాయించారు. ప్రస్తుత పాలకులు జగనన్న కాలనీకి మంజూరైన పీహెచ్‌సీని మల్లమ్మగుడి సమీపంలోని ఒక ఇంట్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసి అక్కడి నుంచి సేవలు అందిస్తున్నారు. అలాగే కోట మండలంలో చిట్టేడు, కేసవరం, కర్లపూడి, కొత్తపాళెం, ఉత్తమనెల్లూరులో జగనన్న కాలనీ ఇళ్లు కేటాయించారు. 8 ఇళ్లు మాత్రమే పూర్తికాగా 96 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిల్లో 28 శ్లాబు దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు చేసిన

ప్రభుత్వం ఆదుకోవాలి



జగనన్న కాలనీల్లో స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోమన్నారు. పనులు ప్రారంభించాం. సొంత ఇంటి కల నెరవేరుతుందని ఎంతో సంతోషించాం. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు.

–ఈగ పావని, చిట్టేడు, కోట మండలం



వెంకటగిరిలో పునాదులకే పరిమితమైన ఇళ్లు



జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు



జగనన్నకాలనీ వ్యూ

పక్కాగా నైపుణ్య గణన

సూళ్లూరుపేట రూరల్: సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాని ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్కిల్ సెన్సెస్‌పై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్లలోపు విద్యార్థులు, ప్రజల అనుభవం, స్వయం ఉపాధి, సొంత వ్యాపారం తదితర వివరాలు సేకరించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి మండల కోఆర్డినేటర్ మురళీకృష్ణ, జయకృష్ణ, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

వాకాడు: నైపుణ్య గణన -2024 సంబంధించి బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జశ్వంత్ మాట్లాడుతూ మండలంలో వివిధ కోర్సులు చదివి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతీ యువకుల వివరాలు సేకరించాలన్నారు. వారి స్కిల్ ఆధారంగా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని చెప్పారు. ఎంపీడీవో పీఎం అన్నపూర్ణారావు, టీవోటీలు అరవింద్, కాకి అశోక్, షేక్ షమీవుల్లా పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని గుర్తించడం ద్వారా ఉపాధి అవకాశాలు

దక్కిలి: మండలంలోని నిరుద్యోగుల నైపుణ్యాన్ని గుర్తించడం ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సచివాలయాల సిబ్బందికి స్కిల్ గణనపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్లలోపు వారి నైపుణ్యాన్ని తెలుసుకోవాలన్నారు. ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ రిసోర్సుపర్సన్ గురువయ్య పాల్గొన్నారు.

డాక్టర్ పాలూరును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



సుదర్శనమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డిని బుధవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. మహేంద్రరెడ్డి తల్లి సుదర్శనమ్మ(78) ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీబీ మాజీ చైర్మన్ జీలపాటూరులోని పాలూరు నివాసానికి చేరుకున్నారు. సుదర్శనమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ మహేంద్రరెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, నాయకులు మాధవరెడ్డి, తిరుపాలయ్య, గోపాలయ్య, పాండు, రమణారెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రసాద్, రవి, రాఘవయ్య పాల్గొన్నారు.

లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ వద్ద కార్మికుల ఆందోళన

నాయుడుపేట టౌన్: మేనకూరు సెజ్‌లో ఉన్న లాయల్ టెక్స్‌టైల్స్ వద్ద బుధవారం మహిళా కార్మికులు సీఐటీయూ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించి పరిశ్రమను మూసివేసి తమ కడుపు కొడుతున్నారని ఆరోపించారు. దీంతో ఉపాధి కోల్పోయి కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోయారు. కార్మిక శాఖ జిల్లా అధికారులు వచ్చి పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ కార్యదర్శి ముకుంద హెచ్చరించారు. అనంతరం పరిశ్రమ వద్ద యాజమాన్యం దిష్టి బొమ్మను దహనం చేశారు.



వీరేంద్రసాయికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థి మృతి బాధాకరం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వీరేంద్రసాయి మృతి చెందడం బాధాకరమని హెచ్ఎం రాజ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో బుధవారం వీరేంద్రసాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈత సరదా ప్రాణాల మీదకు తీసుకొచ్చిందని, విద్యార్థులు ఈతకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

'మా ఊర్లో మద్యం షాపును ఎత్తేయండి'

సైదాపురం: ×మా ఊర్లో మద్యం షాపు వద్దు. దీనివల్ల వివాదాలు చోటుచేసుకుంటాయి. వెంటనే షాపును ఎత్తివేయండి† అని మండలంలోని ఊటుకూరు గ్రామస్తులు కోరారు. వారు బుధవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సైదాపురం మండలం ఊటుకూరు గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో ఇటీవల మద్యం షాపు ఏర్పాటు చేశారని తెలిపారు. కొంతమంది అక్కడే మద్యం సేవించి గొడవలు పడుతున్నారని తెలిపారు. దీనివల్ల ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అశాంతి నెలకొంటుందని, వెంటనే మద్యం షాపు తొలగించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఐఎల్ నరసింహారావు

సూళ్లూరుపేట: సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్స్ నిపుణులు ఐఎల్ నరసింహారావు విద్యార్థులకు సూచించారు. సూళ్లూరుపేట పట్టణంలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది టెక్నాలజీని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్, ఓటీపీ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్, పార్శిల్స్ మోసాలు, ఫేక్ వాయిస్ కాల్స్, ఫేక్ వాట్సాప్ కాల్స్, గూగుల్ సెక్యూరిటీ, మెయిల్స్, పాస్‌వర్డ్, డిజిటల్ ఫుడ్ ప్రింట్స్, క్రెడిట్ కార్డు, ఏటీఎం కార్డు మోసాల విద్యార్థులకు వివరించారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి తమ గ్రామాల ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ముచ్చకాల సురేష్‌బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

చిల్లకూరు: సైబర్ నైరాలపై అవగాహన కలిగి ఉండాలని హైదారాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ నరసింహారావు తెలిపారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లో వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయరాదని, చేస్తే బ్యాంక్ ఖాతాల్లోని నగదు మాయమవుతుందని చెప్పారు. ఎవరైనా బెదిరించినా, నగదు మాయమైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్, రూరల్ సీఐ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సారెతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణం బ్రాహ్మణ వీధిలో ఉన్న వల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణేశ్వరస్వామి స్కంధషష్టి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పిల్లారిగుడి నుంచి చీరలు, పసుపు, కుంకుమతో సారె తీసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవార్లకు సమర్పించారు. రాత్రి స్వామివారి నగరోత్సవాన్ని ఘనంగా చేపట్టారు.

విద్యార్థికి సత్కారం



విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు: తమిళనాడులో తమిళనాడు ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్ 9, అండర్ 11లో విజేతగా నిలిచిన గూడూరు పట్టణంలోని గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి యస్విన్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నతనంలోనే ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పీడీ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు మాట్లాడుతూ ప్రతిఏటా గ్రామంలోని 150 మంది అయ్యప్ప భక్తులకు 40 రోజుల పాటు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో తమ్మనపట్నం, దుమ్ముళదిబ్బ, కొత్తూరు గ్రామాల్లోని మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, కోటా సతీష్‌యాదవ్, రామయ్య, సుబ్బయ్య, వెంకయ్య, సుధీర్, నాగరాజు పాల్గొన్నారు.

పెట్లూరుకు నేదురుమల్లి పరామర్శ



విజయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: మండలంలోని తీర్థంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె ఉత్తర క్రియలు బుధవారం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. విజయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగన్‌మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో చింతల శ్రీనివాసులురెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డి, దశరథరామిరెడ్డి, భాస్కర్ నాయుడు, నారాయణరెడ్డి, వేణు నాయుడు, అరుణాచలం, శ్రీహరిరెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చిట్టేటి హరికృష్ణ, పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి (సైదాపురం): బాలాయపల్లి మండలంలోని కామకూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కూను రామయ్య తల్లి పుల్లమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె ఉత్తరక్రియలు బుధవారం నిర్వహించారు. ఇందులో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. పులమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, రంగనాథం, శ్రీరాములు, రామ్మూర్తి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు నారుమడి యాజమాన్యం, నిమ్మసాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ విత్తన ఎంపికకు ముందే భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. నారుమడి శుద్ధి చేయడం, సమపాళ్లలో సాగునీరు, విత్తన మడి విధానాన్ని తెలియజేశారు. వరినారును ఆశించే తెల్లతెగులుకు మందు లాగడం, క్రిమిసంహార మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లోని నిమ్మ తోటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ, ఉద్యానవన అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం గోల్‌మాల్‌పై విచారణ



శ్యామ్‌సుందరపురం రేషన్‌షాపులో విచారణ జరుపుతున్న తహసీల్దార్ జయజయరావు

కోట: కోట పంచాయతీ శ్యామ్‌సుందరపురం రేషన్ షాపులో బియ్యం గోల్‌మాల్‌పై బుధవారం తహసీల్దార్ జయజయరావు, సీఎస్‌డీటీ మల్లికార్జున్, ఆర్‌ఐ మధులత విచారణ జరిపారు. రేషన్ డీలర్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మి నుంచి రేషన్ షాపును అధికారులు గత నెలలో మోహన్ అనే వ్యక్తికి అప్పగించారు. ఈ క్రమంలో 3,300 కేజీల రేషన్ బియ్యం, 252 ప్యాకెట్ల చక్కెర, ఎండీఎం బియ్యం 1,560 కేజీలు లోటు ఉన్నట్లు మోహన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు గ్రామానికి చేరుకుని నాగలక్ష్మీ, ఎండీయూ ఆపరేటర్ నిస్సార్‌ను విచారించారు. ఎండీయూ ఆపరేటర్ తన పరిధిలో వాహనంలో తీసుకెళ్లి రేషన్ సరుకులను ఇస్తుండగా నాగలక్ష్మీ కొంత సరుకులను రేషన్ షాపులోనే విక్రయించినట్లు గుర్తించారు. నెలల తరబడి ఇదేవిధంగా జరగడంతో అంత భారీ స్థాయిలో బియ్యంలో తేడా వచ్చినట్లు తేలింది. నాగలక్ష్మీపై కేసు నమోదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. జరిగిన నష్టాన్ని వారి నుంచి రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలి



మాట్లాడుతున్న విమల

చిల్లకూరు: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అక్కిలి విమల డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో మహిళలు, యువతులు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. మహిళల కోసం ఏర్పాటుచేసిన చట్టాలను పటిష్టంగా అమలుచేయడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. డబ్బున్న వారికి చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయని విమర్శించారు. అనంతరం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు శశికుమార్, ఏఐఎఫ్ఎస్ నాయకులు యశ్వంత్, సాయి, ప్రణయ్, ఫన్నీ, ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.